

మానకొండూర్‌లో బారులు తీరిన ఓటర్లు



చొప్పదండి: భూపాలపట్నం గ్రామంలో...



తిమ్మాపూర్: అల్గునూర్‌లో ...

మందకొడిగా ప్రారంభమై బారులు

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం మందకొడిగా ప్రారంభమై సాయంత్రానికి ఓటర్లు బారులు తీరారు. అక్కడక్కడ పోలింగ్ కేంద్రాల్లో ఐదు దాటిన తర్వాత పోలింగ్ పరిధిలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. పలువురు ప్రముఖులు కుటుంబ సభ్యులతో ఓటుహక్కును వినియోగించుకున్నారు. అధికారులు, ఎమ్మెల్యే అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఎన్నికల సరళిని పర్యవేక్షించారు. ప్రతి పౌరుడు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. చిన్నచిన్న సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గన్నేరువరంలో ఓటింగ్ సరళిని పరిశీలించడానికి వెళ్లిన బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు కాంగ్రెస్ నాయకుల నుంచి నిరసన వ్యక్తమైంది. గులాబీ షర్ట్‌తో పోలింగ్ కేంద్రానికి రావడం ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఉందని రసమయితో వాగ్వాదానికి దిగారు. పోలీసులు ఇరువర్గాలను పోలింగ్ కేంద్రం నుంచి పంపించారు. ఓటేసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గెలిపిస్తాయని రసమయి, ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందలేదని పదేళ్లలో బీఆర్ఎస్ ఏం అభివృద్ధి సాధించలేదని కవ్వంపల్లి, ఎన్నికల్లో బీఆర్ఎస్ విచ్చల విడిగా డబ్బు పంపిణీ చేసిందని, కాంగ్రెస్ మద్యం అందజేసిందని ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, ప్రజలు ధర్మాన్ని రక్షించాలని బీజేపీయే గెలుస్తుందని మోహన్ ధీమా వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. రామడుగులో 86 పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రక్రియ ఆలస్యం జరిగింది. పోలింగ్ సమయం ముగిసే వరకు పోలింగ్ బూత్‌ల్లో వందలాదిమంది ఉండడంతో అధికారులు వారికి ఓటు వేయడానికి అవకాశం ఇచ్చారు. సాయంత్రం వరకు జరిగిన ఓటింగ్ వల్ల పోలింగ్ శాతం పెరగడం, గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొన్నారు. పోలీస్ యంత్రాంగంతో పాటు అదనపు కేంద్ర బలగాలు విధులు నిర్వహించాయి. ఎన్నికలలో యువ ఓటర్లు ఓటేసేందుకు ఉత్సాహం చూపారు. ఓటర్లు తొమ్మిది గంటల నుంచి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరారు. అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక సదుపాయాలతో వికలాంగులు, వృద్ధులు ఓటు వేశారు. ఆటోల్లో కేంద్రాల వద్దకు తరలించారు. – సాక్షి నెట్‌వర్క్



చిగురుమామిడిలో వీల్‌చైర్‌లో మహిళను తీసుకొస్తున్న దృశ్యం



హుజూరాబాద్‌లో...



గన్నేరువరంలో పోలీసుల బందోబస్తు



చొప్పదండి: బాలికల ఉన్నత పాఠశాలలో ఈవీఎం మొరాయించడంతో ఆందోళన చేస్తున్న ఓటర్లు



రామడుగులో ఓటు వేయడానికి క్యూలైన్‌లో మహిళలు



గన్నేరువరంలో రసమయితో కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం



హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్‌లో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి



ఇల్లందకుంట: సిరిసేడు పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన మహిళా ఓటర్లు



గంగాధర: మధురానగర్‌లో ఓటేసిన బీజేపీ అభ్యర్థి బొడిగె శోభ, కుటుంబ సభ్యులు



ఓటేసిన రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కవిత



రామడుగు: వెదిర గ్రామంలో ఓటేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ మహిళా అధ్యక్షురాలు నెరెళ్ల శారద



వీణవంక: హిమ్మత్‌నగర్‌లో ఓటేసిన గెల్లు శ్రీనివాస్ దంపతులు





ఓటేసిన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, హుజూరాబాద్ చైర్‌పర్సన్ రాధిక దంపతులు

కేసు నమోదు

మానకొండూర్: మండలంలోని ఊటూరులో ఓటర్లకు నగదు పంచుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు గ్రామానికి చెందిన సొసైటీ అధ్యక్షుడు ముద్దసాని ప్రదీప్‌రెడ్డి, ముద్దసాని సుమంత్, పచ్చునూర్‌లో పి. కిషన్ అనే వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేశారు.

ఓటెత్తిన చైతన్యం

తిమ్మాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో తిమ్మాపూర్ పౌరులు ఓటెత్తారు. ఈసారి పోలిగ్ కేంద్రాల వద్ద చర్యలు, ఓటుహక్కు ఆవశ్యకతపై ప్రభుత్వం, ఎన్నికల సంఘం విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో గురువారం ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఓపికగా గంటల తరబడి క్యూలో నిల్చొని ఓటుహక్కు వినియోగించుకున్నారు. మహిళలు సైతం పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు నడుచుకుంటూ వెళ్లి ఓటు వేశారు. ఈసారి యువ ఓటర్లు అధిక సంఖ్యలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉపాధి కోసం నేపాల్‌కు వెళ్తున్న రామకృష్ణకాలనీలోని బుడిగ జంగాలు కూడా ఓటు వేసేందుకు స్వగ్రామానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అన్ని గ్రామాల్లోనూ సగటున ఎనభై శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. రైతులు, వృద్ధులు, వికలాంగులు ఓటు వేసేందుకు వచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు వృద్ధులు, వికలాంగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు. అల్లర్లు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వికలాంగులను ఇళ్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడానికి ఈసీ ఆదేశాల మేరకు అధికారులు ఆటోలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసిన తర్వాత వారిని తిరిగి ఇళ్ల వద్ద దించారు. మొగిలిపాలెం గ్రామంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పింక్ కలర్ చొక్కా వేసుకొచ్చారని కొంతమంది అభ్యంతరం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి ఎప్పటికప్పుడు అన్ని గ్రామాలను పర్యవేక్షించారు. అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకున్నారు.



తిమ్మాపూర్: రామకృష్ణకాలనీలో బారులు తీరిన ఓటర్లు

ప్రభుత్వ వ్యతిరేకత ఏ మేరకు..

చొప్పదండి: చొప్పదండి నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఉంటుందని భావించినా, చివరలో ద్విముఖ పోటీ మాత్రమే జరిగిందని ఓటింగ్ సరళిని బట్టి అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఏమేరకు ప్రభావం చూపిందనేది గెలుపు, ఓటములను ప్రభావం చూపించనుంది. ఎవరికి వారు తామే గెలుస్తున్నామని అంచనాలు వేసుకుంటున్నారు. చొప్పదండిలో ఒకచోట కొద్దిసేపు ఈవీఎం మొరాయింపు మినహా సాంకేతిక సమస్యలు తలెత్తలేదు. ఓటు వేసేందుకు గ్రామాల్లో ఉదయం నుండే బారులు తీరారు.



సైదాపూర్: దెబ్బలు చూపిస్తున్న కార్యకర్తలు

సైదాపూర్: మండలంలోని రాయికల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలను కరీంనగర్ సీసీఎస్ సీఐ పుల్లయ్య చితకబాదారు. సీఐ పుల్లయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. దుద్దెనపల్లిలో పోలింగ్ ఆఫీసర్ మహిళా ఓటర్లను కారు గుర్తుకు ఓటేయాలంటున్నాడని పోలింగ్ బూత్ నుంచి బయటికి వచ్చిన మహిళా ఓటర్లు ఆరోపించారు.

నూతనోత్సాహం

- తొలిసారి ఓటుహక్కును వినియోగించుకున్న యువత
- ఓటు వేసేందుకు పోటీపడ్డ కొత్త ఓటర్లు



తొలిసారి ఓటుహక్కును వినియోగించుకున్న యువ ఓటర్లు

మానకొండూర్: పద్దెనిమిదేళ్లు నిండిన యువత ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసేందుకు ఉత్సహం చూపారు. ఇటీవలే 18 సంవత్సరాలు నిండినవారు దరఖాస్తు చేసుకోగా యువతకు అధికారులు ఓటుహక్కు అవకాశం కల్పించారు. గురువారం జరిగిన ఎన్నికల్లో ఓటేసి సంతోషం వ్యక్తం చేశారు. సమాజంలో మార్పును తీసుకొచ్చి జాతి భవిష్యత్‌ను మార్చగలమని, యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. ప్రజలకాంక్ష, అభివృద్ధికి పాటు పడే వారినే నిలబెట్టగలమన్నారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు వినియోగించుకున్నామని పలువురు పేర్కొన్నారు.

సంతోషంగా ఉంది



తొలిసారిగా నేను అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నా. ఇటీవలే ఓటుహక్కుకోసం దరఖాస్తు చేసుకున్నాను. ఓటరు ఐడీకార్డు వచ్చింది. గురువారం పోలింగ్ కేంద్రానికి వెళ్లి సంతోషంగా ఓటు వేశాను. తొలిసారి ఓటు వేయడం చాలా సంతోషంగా ఉంది. – శారూన్, చెంజర్ల

ఏర్పాట్లు బాగున్నాయి



మా గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే సమయంలో ఇబ్బందులు పడకూడదని అధికారులు చేసిన ఏర్పాట్లు బాగున్నాయి. తొలిసారిగా ఓటు వేయడంతో కొత్త అనుభూతి కలిగింది. తాగునీరు, నీడ, వైద్య సదుపాయం కల్పించారు. – సిరిపురం పల్లవి, మానకొండూర్

ఇబ్బంది లేకుండా ఓటేశాను



ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అనేది ఒక ఆయుధం వంటిది. అలాంటి ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి. యువత మంచి నాయకుడిని ఓటువేసి ఎన్నుకోవాలి. ఎలాంటి ఇబ్బంది లేకుండా నేను మొదటిసారి ఓటుహక్కును వినియోగించుకున్నా. – కొండవేని రాకేశ్ గంగిపల్లి

సద్వినియోగం చేసుకున్నా



మొదసారి ఓటు వేశాను. పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిల్చొని ఓటుహక్కును వినియోగించుకున్నా. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. చాలా మంది యువత తొలిసారి ఓటును సద్వినియోగం చేసుకున్నారు. – శ్రీవల్లి, ఊటూరు

నగర సంకీర్తన

జమ్మికుంట: పట్టణంలో శివుని ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పట్టణ పురవీధుల్లో భవాని భజన మండలి, శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఆరుద్ర నక్షత్ర నగర సంకీర్తన నిర్వహించారు. పుర వీధుల గుండా భజనలు చేస్తూ, శివ నామస్మరణ చేశారు. ఈకార్యక్రమంలో శివ మాల ధారణ భక్తులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



పురవీధుల్లో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు